సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



చీనీ టన్ను రూ.26,530

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26,530, కనిష్టంగా రూ.3 వేలు పలికాయి. మార్కెట్‌కు 746 టన్నులు చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
39.9°/19.4°

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలతో ఎండవేడిమి పెరిగింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పశువుల నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేయాలి



నీటి తొట్టె నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: వేసవి తీవ్రమవుతున్న తరుణంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాన్ని 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం ఆయన.. పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో పశువుల నీటి తొట్టికు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు 1,362 నీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. డ్వామా ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. వేసవిలో పశువులు నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు గ్రామంలో అందరి సహకారంతో అనువైన చోట నీటి తొట్టెను నిర్మించాలన్నారు. ఒక్కో నీటి తొట్టికు ప్రభుత్వం 'ఉపాధి హామీ' ద్వారా రూ.33 వేలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, డీపీఓ సమత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువకు గండి



కాలువ తెగి వృథాగా పోతున్న నీరు

సోమందేపల్లి: హంద్రీ-నీవా కాలువకు గండి పడింది. మంగళవారం తెల్లవారుజామున మండల పరిధిలోని కాలువ కట్ట తెగిపోయింది. దీంతో నీరంతా వృథాగా పొలాల్లో పారింది. నీటి ఉధృతి ఎక్కువ కావడంతోనే కట్ట తెగినట్లు రైతులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న హంద్రీ-నీవా అధికారులు అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

'డైట్' అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నంలోని విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న 17 అధ్యాపకుల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిప్యూటేషన్ పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ స్కూల్ అసిస్టెంట్‌లు, హెచ్‌ఎంలు, ఎంఈఓలు అర్హులు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ ఐదేళ్ల పైబడిన సర్వీసు కలిగిన 58 సంవత్సరాల్లోపు వయసున్న వారు, ఈ నెల 10 తేదీ లోపు అనంతపురంలోని డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 16, 17 తేదీల్లో రాత పరీక్ష, 19న మౌఖిక పరీక్షలు నిర్వహించి జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు డైట్ కళాశాల ప్రినిపాల్‌ను సంప్రదించవచ్చు.


జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం వాసి



కార్తీక్ నాయక్‌ను అభినందిస్తున్న శెట్టిపి జయచంద్రారెడ్డి, తదితరులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో ధర్మవరానికి చెందిన కార్తీక్‌నాయక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం కార్తీక్ నాయక్‌ను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు చిత్తూరులో శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారని, ఈ శిక్షణలో రాణించి జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ నాగేంద్ర పాల్గొన్నారు.

కరుణ కరువు



అనావృష్టితో జిల్లా రైతులు కన్నీటి సేద్యం చేసినా కూటమి ప్రభుత్వానికి కరుణ కలగలేదు. అన్ని మండలాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయినా పాలకులకు కనిపించలేదు. పెట్టుబడులు నేలపాలై రైతులు గగ్గోలు పెట్టినా వినిపించలేదు. అందుకే తాజా కరువు ప్రభావిత జాబితాలో జిల్లాలోని రెండు మండలాలనే చేర్చిన చంద్రబాబు సర్కార్...రైతులపై తమకున్న 'ప్రేమ' ఏపాటిదో మరోసారి రుజువు చేసుకుంది.

- రైతులను దగా చేసిన కూటమి సర్కార్
- కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం
- కేవలం రెండు మండలాలకే జాబితాలో చోటు
- 'తీవ్ర కరువు' ప్రభావ మండలంగా రొద్దం ప్రకటన
- తనకల్లులో మోస్తరు కరువుగా పేర్కొన్న వైనం
- చంద్రబాబు సర్కార్‌పై దుమ్మెత్తి పోస్తున్న రైతాంగం

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం జిల్లా రైతులను దగా చేసింది. రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావంతో జిల్లా రైతులు పంటలన్నీ కోల్పోయినా కేవలం రొద్దం, తనకల్లు మండలాలనే కరువు ప్రభావిత జాబితాలో చేర్చింది. అందులోనూ రొద్దం మండలాన్ని తీవ్ర కరువు మండలంగా, తనకల్లును సాధారణ కరువు మండలంగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం, చీడపీడలు తదితర కొలమానం ఆధారంగా కరువు జాబితా ప్రకటించారు. గత ఏడాది రబీలోనూ రొద్దం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి చేతులు దులుపుకున్నారు. రైతాంగానికి ఎలాంటి సాయమూ అందించలేదు.

ఖరీఫ్ చివర్లో అతివృష్టి..

గత ఏడాది ఖరీఫ్ మొదట్లో తీవ్ర వర్షాభావం వెంటాడగా పంటల సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.89 లక్షల హెక్టార్లు కాగా, వర్షాభావంతో కేవలం 1.49 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగులోకి వచ్చాయి. వేసిన పంటలు కూడా సరిగ్గా చేతికందే సమయంలో తుపాను కారణంగా తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పెట్టుబడి సైతం రాక రైతులు తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశించినా... ఇప్పటి వరకూ కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించ లేదు.

రబీలో అనావృష్టి

రబీ సీజన్‌లో అనావృష్టితో జిల్లా వ్యాప్తంగా కేవలం 64 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో ఎక్కువగా వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, ప్రొద్దు తిరుగుడు పంటలతో పాటు ఉద్యాన పంటలున్నాయి. కానీ తీవ్ర వర్షాభావంతో పంటలన్నీ చేతికి అందకుండా పోయాయి. జిల్లాలో అత్యంత దయనీయంగా, కరువుకు ప్రతిరూపంగా నల్లమాడ, తాడిమర్రి, పుట్టపర్తి, బుక్కపట్నం, అమడగూరు, చిలమత్తూరు, పరిగి, మడకశిర తదితర మండలాలు నిలిచాయి. కానీ ప్రభుత్వం కేవలం రెండు మండలాలనే కరువు జాబితాలో చేర్చడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సంవత్సరం కూడా ప్రభుత్వం రబీలో 11 మండలాలను కరువు జాబితాలో చేర్చినా ఎలాంటి సాయం అందించలేదు. కనీసం ఉపాధి పనులు కూడా 200 రోజులకు పెంచలేదు.

జగన్ పాలన తలచుకుంటున్న రైతాంగం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు క్రమం తప్పకుండా 'రైతు భరోసా' పేరుతో పెట్టుబడికి ఆర్థిక సాయం అందేది. పంటలకు నష్టం వాటిల్లితే ఏ సీజన్‌లో పంట నష్ట పోతే అదే సీజన్‌లోనే పరిహారం ఖాతాల్లో జమ అయ్యేది. అలాగే పంట పండితే మెరుగైన మార్కెటింగ్ సౌకర్యంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లభించేది. పంటలు నష్టపోతే ఉచిత పంటల బీమా కింద పరిహారం పెద్ద ఎత్తున అందేది. దీంతో రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక పరిస్థితి మొత్తం మారిపోయింది.

రైతుల ఆగ్రహం

జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయినా రెండు మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరువు బృందం సభ్యులు పర్యటించిన సమయంలో వినతి పత్రాలు అందజేసినా... ఫలితం లేకపోయిందని పెనుకొండ, పుట్టపర్తి, కొత్తచెరువు రైతులు వాపోతున్నారు. ఎన్నికల హామీలుగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ, పంటల బీమా ఊసే లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కూటమి సర్కార్ వైఖరికి నిరసనగా త్వరలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

రైతుకు తీరని అన్యాయం



రబీ పంటలన్నీ తుడిచిపెట్టుకు పోయినా జిల్లాకు చెందిన రెండు మండలాలనే కరువు జాబితాలో చేర్చడం అన్యాయం. ఈ ప్రభుత్వానికి రైతులపై కరుణ కలగలేదు. పంట నష్టాన్ని అంచనా వేయడంలో శాస్త్రీయత లోపించింది. కూటమి సర్కార్ ఇంతవరకూ రైతులకు ఎలాంటి సాయం అందించలేదు. ఎన్నికల హామీలైన అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు అందజేయలేదు. ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలపై రైతాంగాన్ని సమీకరించి ఉద్యమిస్తాం.

– అడపాల వేమనారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, పుట్టపర్తి

అన్ని మండలాలను 'కరువు' జాబితాలో చేర్చాలి



జిల్లాలో అన్ని మండలాల్లోనూ కరువు తాండవిస్తోంది. అందువల్ల 32 మండలాలనూ కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించాలి. అంతేకాకుండా రైతాంగాన్ని ఆదుకోవాలి. గత ఏడాది రొద్దం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా... ఇప్పటి వరకూ ఎలాంటి సాయం చేయలేదు. కనీసం ఇప్పటికైనా రైతులపై కరుణ చూపి ఆదుకోవాలి.

– లక్ష్మీనారాయణరెడ్డి, రైతు సంఘం నాయకులు, జగరాజుపల్లి

నివేదికలు పంపాం



ప్రభుత్వం అడిగినప్పుడల్లా జిల్లాలో పంటల సాగు, నష్టం వివరాలను పంపుతున్నాం. గతంలో రొద్దం మండలానికి సంబంధించిన పూర్తి సమాచారం పంపాం. ఈ సారీ రొద్దం మండలానికి సంబంధించిన నివేదిక పంపాల్సి ఉంది. రొద్దంలో వర్షాధారం కింద పప్పు శనగ సాగు చేస్తారు. దీంతో అక్కడ నష్టం పెరుగుతుంది. నివేదిక పంపడమే వ్యవసాయశాఖ బాధ్యత.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ముగిసిన పదో తరగతి పరీక్షలు

- చివరిరోజు సోషల్ పరీక్షకు 240 మంది గైర్హాజరు
- ముగ్గురు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్, ఓ విద్యార్థి డీబార్



గుడిబండలోని పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 104 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

ముగ్గురిపై వేటు

మార్చి 17న పరీక్షలు ప్రారంభం కాగా, చివరి రోజు నాటికి విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఇన్విజిలేటర్లపై సస్పెన్షన్ వేటు పడింది. మాస్‌కాపీయింగ్ చేస్తూ దొరికిపోయిన ఓ విద్యార్థి డీబార్ అయ్యారు. గణితం పరీక్ష రోజున పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రత్యేకాధికారి సుబ్బారావు కదిరి నియోజకవర్గంలో పర్యటించి... విధుల్లో నిర్లక్ష్యం వహించిన కదిరి బాలికల ఉన్నత పాఠశాల ఇన్విజిలేటర్లు రుద్రమరెడ్డి, డి.కృష్ణప్పను సస్పెండ్ చేశారు. అలాగే ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి మాస్ కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌కు దొరికిపోయాడు. దీంతో విద్యార్థిని డీబార్ చేశారు. విద్యార్థి మాస్‌కాపీయింగ్ చేస్తున్నా.. చర్యలు తీసుకోని ఇన్విజిలేటర్ మహమ్మద్ రఫీని సస్పెండ్ చేశారు. అంతేకాకుండా ఆ పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను విధుల నుంచి తప్పించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చివరి రోజు 240 మంది గైర్హాజరు

చివరి రోజు మంగళవారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 240 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప తెలిపారు. 21,448 మందికి గాను 21,248 మంది మాత్రమే హాజరయ్యారని ఆయన వివరించారు.

ఎండలకు రాలేం సారూ

- సెకండ్ ఇంటర్ తరగతులు ప్రారంభం
- తొలిరోజు ఒక్కరూ హాజరుకాని వైనం
- చాలా ప్రాంతాల్లో తెరచుకోని కళాశాలలు
- సర్కారు నిర్ణయంపై భగ్గుమంటున్న తల్లిదండ్రులు



విద్యార్థులు రాక తెరుచుకోని కొత్తచెరువులోని జూనియర్ కళాశాల

పుట్టపర్తి: భానుడి భగభగలతో జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కుకు చేరుకుంటున్నాయి. ఉదయం 10 తర్వాత కాలు బయటపెట్టాలంటేనే జనం భయపడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్ బోర్డు విద్యార్థులను ఇబ్బంది పెట్టే నిర్ణయం తీసుకుంది. ఏటా జూన్‌లో ప్రారంభించే సెకండ్ ఇంటర్ తరగతులను ఈసారి ఏప్రిల్ 1వ తేదీనే ప్రారంభించింది. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

తొలిరోజు ఒక్కరూ రాలేదు

సెకండ్ ఇంటర్ తరగతులను ప్రభుత్వం మంగళవారం అట్టహాసంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించినా జిల్లాలో ఒక్కరంటే ఒక్కరూ తరగతులకు హాజరు కాలేదు. జిల్లాలో 70 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 42 ప్రైవేట్ కళాశాలలు ఉండగా... 13,083 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నారు. అయితే తీవ్రమైన ఎండలు, మంగళవారం సెంటిమెంట్ నేపథ్యంలో తొలిరోజు చాలా కళాశాలలు కూడా తెరుచుకోలేదు.

కళాశాలల్లో సౌకర్యాలు ఎక్కడ?

వేసవిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెకండ్ ఇంటర్ తరగతులు ప్రారంభించిన ప్రభుత్వం కళాశాలల్లో కనీస సౌకర్యాలపై మాత్రం దృష్టి సారించలేదు. చాలా కళాశాలల్లో ఇప్పటికే ఫర్నీచర్ కొరత వేధిస్తోంది. ఇక తాగునీరు, ఫ్యాన్ లాంటి సౌకర్యాలు ఎన్ని కళాశాలల్లో ఉన్నాయో ఇంటర్ బోర్డు అధికారులకే తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా హడావుడిగా తరగతులు ప్రారంభించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఏ రాష్ట్రంలోనైనా కళాశాలలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయా.. అని ప్రశ్నిస్తున్నారు.

జూన్ నుంచి ప్రారంభించాలి



మేం మొదటి సంవత్సరం పరీక్షలు రాసి 15 రోజులు కూడా కాలేదు. అప్పుడే సెకండ్ ఇంటర్ తరగతుల ప్రారంభించడం సరికాదు. ఎండలు మండుతున్న తరుణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు చాలా దారుణం. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– పవన్, సెకండ్ ఇంటర్ విద్యార్థి, బుక్కపట్నం

కార్పొరేట్ కళాశాలల లబ్ధికే



వేసవిలోనే తరగతులు ప్రారంభించడం వల్ల నారాయణ, శ్రీ చైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్లకు ఇబ్బందులు ఉండవు. అందుకోసమే ప్రభుత్వం ఇంటర్ తరగతుల నిర్వహణ చేపట్టింది. ఇందుకోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది.

– అమర్నాథ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ ఎస్‌యూ

చౌడేశ్వరీ.. నమోస్తుతే



విశేష అలంకరణలో కొటిపి చౌడేశ్వరీదేవి



భక్త జన సందోహం మధ్య గ్రామవీధుల గుండా సాగుతున్న చౌడేశ్వరీదేవి రథోత్సవం

హిందూపురం: మండలంలోని కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి రథోత్సవం మంగళవారం కమనీయంగా సాగింది. ఏటా ఉగాది పండుగ అనంతరం అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ సాగుతోంది. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిమంది తరలివచ్చారు. దీంతో కొటిపి గ్రామం కిక్కిరిసింది.

సారె సమర్పించి...మొక్కులు తీర్చుకుని

ఉత్సవాల సందర్భంగా మంగళవారం తెల్లవారుజామునే మూలవిరాట్ చౌడేశ్వరీదేవి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలతో పాటు పుష్పాలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికు ఒడిబియ్యం, సారె సమర్పించారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు ఆలయం వద్ద కోళ్లు, మేకలను అమ్మవారికి బలి ఇచ్చారు . జాతర సందర్భంగా గ్రామ ప్రజలు బంధువులు, సన్నిహితులను పిలిచి విందు భోజనం పెట్టారు.

వైభవంగా రథోత్సవం

సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు చేసి అత్యంత శోభాయమానంగా ముస్తాబుచేశారు. అనంతరం అర్చకులు మేళతాళాలతో రథంపై కొలువుదీర్చి కొటిపి గ్రామ వీధులు గుండా ఊరేగించారు. అనంతరం రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. ఉత్సవాన్ని తిలకించేందుకు హిందూపురం చుట్టుపక్కల గ్రామాలే కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా హిందూపురం రూరల్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధర్మవరం రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతాం



రైల్వేస్టేషన్ పనులను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, విల్సన్‌బాబు



రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల చిత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- గుంతకల్లు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మవరం: అత్యాధునిక సౌకర్యాలు కల్పించి ధర్మవరం రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతామని గుంతకల్లు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ విల్సన్‌బాబు తెలిపారు. మంగళవారం వారు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ప్లాట్ ఫారం, విశ్రాంతి గది, బుకింగ్ కౌంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ధర్మవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం కేంద్రం రూ.7.50 కోట్లు ప్రకటించిందన్నారు. ఇందులో తొలివిడతగా రూ.3.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. అలాగే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ బలగాల కోసం నూతన భవనాలు నిర్మించేందుకు కూడా నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడతామన్నారు. అలాగే రైల్వే ఆస్పత్రి నిర్మాణానికీ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గూడ్స్‌షెడ్ కొట్టాల వైపు నుంచి వచ్చే ప్రయాణికుల కోసం బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ చల్లా నరసింహ నాయుడు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, బాబూజీరావు, సీనియర్ సెక్షన్ సివిల్ ఇంజినీర్ ఉమేష్‌కుమార్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మీ మేలు మరువలేం'

కదిరి అర్బన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాము జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మణికాంత్, కార్యదర్శి లింగాల కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసి ఏడాది గడిచిన సందర్భంగా వారు మంగళవారం ఓ ప్రకటనలో వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమకు న్యాయంగా దక్కాల్సిన ఓల్డ్ పెన్షన్ స్కీం, నోషనల్ ఇంక్రిమెంట్‌లను అందజేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ఫారం పాండ్‌లు నిర్మించుకోండి



ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి హరినారాయణ

పెనుకొండ రూరల్: పంటల సాగుకు దోహదపడే ఫారం పాండ్ల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలని జిల్లా ప్రత్యేకాధికారి హరినారాయణ పిలుపునిచ్చారు. పెనుకొండ మండలం రాంపురంలో ఉపాధీ హమీ పథకం కింద చేపట్టిన ఫారం పాండ్, మినీ గోకులాల పనులను మంగళవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. సాగుభూములను సారవంతం చేయడంలోను, ఏటా రైతులు విభిన్న పంటల సాగు చేపట్టేలా ఫారం పాండ్‌లు దోహదపడతాయన్నారు. అనంతరం రాంపురం గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డ్వామా పీడీ నరసయ్య, సెరికల్చర్ జేడీ పద్మావతి, తహసీల్దార్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై టీడీపీ కార్యకర్తల దాడి



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన బాలాజీ

పుట్టపర్తి అర్బన్: మండలం వెంగళమ్మచెరువులో ఓ యువకుడిపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన మేరకు.. గతంలో గ్రామంలో టీడీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఓ పంచాయితీలో అదే గ్రామానికి చెందిన వడ్డె బాలాజీ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనుకూలంగా మాట్లాడాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుల కక్ష కట్టి మంగళవారం సాయంత్రం బాలాజీ ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు చొరబడి చితకబాదారు. కుటుంబసభ్యుల కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని టీడీపీ నాయకులకు సర్దిచెప్పి పంపారు. ఘటనలో బాలాజీకి మూగదెబ్బలు తగిలాయి. బాధితుడి సమాచారంతో పుట్టపర్తి రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

మాత్రల మత్తు.. యువత చిత్తు



- మత్తు కోసం కొత్త పంథాను ఎంచుకున్న యువత
- గంజాయి, హెరాయిన్‌కు ప్రత్యామ్నాయంగా మెడికల్ స్టోర్‌లో దొరికే మందుల వినియోగం
- యువత బలహీనతలపై మెడికల్ స్టోర్ నిర్వాహకుల అక్రమ దందా
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు కలిగించే మందుల విక్రయాలు

గంజాయిని సిగరెట్లో ఉంచి పీల్చినప్పుడు వెలువడే పొగతో ఘాటైన వాసన వెలువడి అందరికీ తెలిసిపోతుంది. దీంతో అందరి దృష్టి తమపై పడుతుందని భావిస్తోన్న యువత... ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంది. ఫలితంగా జిల్లాలోని మందుల దుకాణాల్లో మత్తును కలిగించే ఔషధాల విక్రయం పెరిగిపోయింది. ఇటీవల డ్రగ్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి.



హిందూపురంలోని మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అధికారులు (ఫైల్)



హిందూపురంలోని శంకర్ మెడికల్స్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

హిందూపురం టౌన్: మత్తు కోసం యువత అడ్డదారులు తొక్కుతోంది. మందుల దుకాణంలో దొరికే సాధారణ రుగ్మతలు, శస్త్రచికిత్స చేసిన తర్వాత, అత్యవసర సమయాల్లో వినియోగించే ఔషధాలను విచ్చలవిడిగా వాడుతూ మత్తుకు బానిసవుతోంది. యువత బలహీనతలను ఆసరాగా చేసుకున్న కొందరు మెడికల్ స్టోర్ నిర్వాహకులు మాదకద్రవ్యాలు కాని ఇలాంటి మందుల విక్రయాలతో అక్రమ సంపాదనకు తెరతీశారు. డాక్టర్స్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు కలిగించే మాత్రలు విక్రయిస్తుండడంతో చాలా మంది యువకులు వాటిని వినియోగిస్తూ మత్తులో మునకలేస్తున్నారు. మద్యపానానికి, గంజాయికి ప్రత్యామ్నాయంగా రసాయనాలు, జెల్‌లు, మాత్రల వినియోగం ఇటీవల జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతోంది.

మచ్చుకు కొన్ని..

- హిందూపురంలోని శంకర్ మెడికల్స్‌లో గత ఏడాది డిసెంబర్ 21న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, డీఎస్పీ మహేష్, సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడని మందులను విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్న ప్రాస్మోప్రాక్స్ మందులను గుర్తించి సీజ్ చేశారు.
- ఈ నెల 21న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అధికారులు హిందూపురంలోని పలు మెడికల్ స్టోర్లలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నిద్రమాత్రలు, నొప్పి తగ్గించే మాత్రలను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్న మూడు మెడికల్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు

హిందూపురం పట్టణంలో సుమారు 160కు పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. వీటిలో చాలా వాటిలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులను విక్రయిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో అయితే ఓ వ్యక్తి తనకు ఫలానా సమస్య ఉందని చెబితే చాలు వారే డాక్టర్లుగా మారి మందులను అంటకడుతున్నారు. ఇలాంటి వ్యవస్థీకృత ముఠాలు జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మత్తును కలిగించే మందులు, ట్రమడాల్, ఆల్‌ప్రాజోలమ్, ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్, నిద్రమాత్రలు తదితర మందులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా దొరుకుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తంతు చాలా ఏళ్లుగా కొనసాగుతున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో వెల్లడైంది. ముఖ్యంగా స్పాస్మో ప్రాక్సివాన్ ప్లస్ మాత్రలను యువత ఎక్కువగా కొనుగోలు చేస్తూ మత్తు కోసం వాడుతున్నట్లు సమాచారం.

సంసారానికి పనికి రారు



మత్తును కలిగించే మాత్రలను ఎక్కువగా ఉపయోగిస్తే యువతలోని సహజ శక్తిసామర్థ్యాలు సన్నగిల్లుతాయి. రోగనిరోధక శక్తి దెబ్బతింటుంది. ముఖ్యంగా సంసారానికి పనికిరాకుండా పోతారు. దుష్పరిణామాలపై ఎలాంటి అవగాహన లేకుండా మందులు ఉపయోగిస్తే ప్రాణాలతో చెలగాటమాడినట్లవుతుంది. వైద్యుల సలహా లేనిదే ఏ మాత్రలనూ వాడకూడదు.

– డాక్టర్ శివకుమార్, ప్రభుత్వాస్పత్రి వైద్యుడు

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే టాబ్లెట్‌లు, సిరప్‌లను విక్రయించే మెడికల్ షాప్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం . ఇప్పటికే మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టి కొన్నింటిని సీజ్ చేశాం. మరి కొందరికి నోటీసులు జారీ చేశాం. మత్తు కలిగించే మాత్రలు, ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌ను, శాంపుల్ డ్రగ్‌ను అమ్మరాదు.

– హనుమన్న, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హిందూపురం ఇన్‌చార్జ్

యువకుడి ఆత్మహత్య



ఓబిరెడ్డి (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామానికి చెందిన రైతు సుబ్బిరెడ్డి కుమారుడు ఓబిరెడ్డి (30) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు... ఎంబీఏ వరకు చదువుకున్న ఓబిరెడ్డి తన చదువుకు తగిన ఉద్యోగం రాకపోవడంతో ఇంటి పట్టునే ఉంటూ వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా ఉండేవాడు. వీరి పొలానికి సమీపంలో కేకే తండాకు చెందిన రవీంద్రానాయక్, ఆనంద్‌నాయక్, బాలకృష్ణనాయక్, నీలిబాయికు చెందిన పొలాలున్నాయి. రెండు రోజుల క్రితం పక్క పొలానికి చెందిన తండా వాసులు వారి పొలంలోని చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి ఓబిరెడ్డికి చెందిన గడ్డివామిని చుట్టుముట్టాయి. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో తండావాసులు అవమానించడంతో మనోవేదనకు లోనైన సోమవారం రాత్రి తల్లిదండ్రులు ఇద్దరూ పశువుల పాక వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓబిరెడ్డి మంగళవారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉరికి విగతజీవిగా వేలాడుతున్న ఓబిరెడ్డిని గమనించి బోరున విలపించారు. కుమారుడి మృతి కారణమైన రవీంద్రనాయక్, ఆనంద్‌నాయక్. బాలకృష్ణానాయక్, నీలిబాయిపై చర్యలు తీసుకోవాలంటూ మృతుని తండ్రి సుబ్బిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని గార్లదిన్నె- తాటిచెర్ల మార్గమధ్యంలో రైలు నుంచి జారిపడి ఓ యువకుడు (30) మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులో యాదగిరి నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే రైల్వే జనరల్ టికెట్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది. మృతుడు ఎరుపు, నీలం గీతలు కలిగిన పసుపు రంగు ఆఫ్ టీ షర్ట్, లైట్ సిమెంట్ రంగున్న షర్ట్, మెరూన్ రెడ్ కలర్ ఉన్న ఫుల్ అండర్‌వేర్ ధరించాడని, ఎత్తు 5.5 అడుగులు, ఛామన ఛాయ రంగు, ఎడమ చేతికి పి.మహి అని, కుడి చేతిపై ఎంఎస్ అనే ఆంగ్ల అక్షరాలు పచ్చబొట్టు వేయించుకున్నాడని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. లవ్ సింబల్ సహా ఓం అనే సింబల్ పచ్చ రంగు టాటూ కూడా చేతిపై ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు :94406 27662 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అనంతలో చైన్‌స్నాచర్ బరితెగింపు



బాధితురాలు శకుంతల

అనంతపురం: నగరంలో ఓ చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. సామాజిక పింఛన్ల పంపిణీకి స్కూటీలో బయలుదేరిన ఓ సచివాలయ ఉద్యోగిని వెంటాడి, ఆమె మెడలోని బంగారం చైన్‌ను బలవంతంగా లాక్కెళ్లాడు. వివరాలు.. అనంతపురం నగరంలోని 71వ సచివాలయంలో హెల్త్ సెక్రెటరీగా పని చేస్తున్న శకుంతల మంగళవారం ఉదయమే సామాజిక పింఛన్ల పంపిణీకి స్కూటీలో బయలుదేరారు. బైపాస్ నుంచి హెచ్చెల్సీ పక్కనే ఉన్న దారిలో వెళుతున్న ఆమెను గమనించిన ఓ యువకుడు వెంబడిస్తూ నిర్మానుష్య ప్రాంతంలో తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుపెట్టి అటకాయించాడు. హఠాత్పరిణామంతో ఆమె తేరుకునేలోపు మెడలోని బంగారం చైన్‌ను బలవంతంగా లాగేశాడు. దీంతో చైన్ రెండు ముక్కలైంది. తన చేతికి అందిన సగం చైన్‌తో యువకుడు అక్కడి నుంచి శరవేగంగా ఉడాయించాడు. ఘటనపై బాధితురాలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం

- రూ. 5 లక్షలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

అనంతపురం: విద్యుదాఘాతానికి గురై మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖను అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన సోమలూరు పుల్లయ్య బతుకు తెరువు కోసం వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో కూలి పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో 2022, డిసెంబర్ 15న విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ అదే నెల 18న మృతి చెందాడు. ఘటనకు సంబంధించి అప్పట్లో పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త మృతితో జీవనోపాధి కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలంటూ అదే సమయంలో విద్యుత్ శాఖ అధికారులను పుల్లయ్య భార్య యశోద అభ్యర్థించింది. అయితే ఈ అభ్యర్థనను విద్యుత్ శాఖ అధికారులు తిరస్కరించారు. పుల్లయ్య మృతికి ఆయన నిర్లక్ష్యమే కారణమని, ఇందులో తమకు ఎలాంటి బాధ్యత ఉండదని తిప్పి పంపారు. లీగల్ నోటీసు పంపినా ఫలితం లేకపోవడంతో బాధితురాలు అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో నోటీసులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు కమిషన్ ఎదుట హాజరై తమ వివరణ ఇచ్చారు. 11 కేవీ లైన్‌కు సంబంధించి మాత్రమే తమకు బాధ్యత ఉంటుందని, పుల్లయ్య కేసులో ఆయన నిర్లక్ష్యమే కారణమని, ఈ అంశంలో సదరు యజమానికి బాధ్యత ఉంటుంది తప్ప తమ బాధ్యత కాదని వాదనలు వినిపించారు. కేసు పూర్వపరాలు, విద్యుత్ శాఖ అభ్యంతరాలు పరిశీలించిన మీదట విద్యుదాఘాతం కేసుల్లో బాధితులకు సంబంధించి చెల్లించాల్సిన పరిహారాల నిబంధనలను అనుసరించి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనంటూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత తీర్పు వెలువరించారు. తీర్పు వెలువరించిన రోజు నుంచి ఆరు శాతం వడ్డీతో సహా చెల్లించాలన్నారు. అలాగే సేవా లోపానికి రూ.10 వేలు, మనోవేదనకు రూ.10 వేలు, ఖర్చులకు రూ.3వేలు చెల్లించాలని అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు డి. గ్రేస్ మేరీతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

వర్గకక్షలకు ఆజ్యం పోసిన అధికారులు



వివాదాలకు కేంద్ర బిందువైన వెంగళమ్మచెరువు గ్రామ చెరువు

పుట్టపర్తి అర్బన్: టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ప్రశాంత గ్రామంలో వర్గ కక్షలకు ఆజ్యం పోశారు. ఏకపక్ష నిర్ణయాలతో ఓ వర్గానికి వత్తాసు పలకడం వివాదాస్పదమైంది. వివరాలు.. పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు గ్రామంలోని చెరువులో చేపల పెంపకాన్ని చేపట్టి వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామంలో మత్స్యకార సహకార సంఘం ఏర్పాటు చేసి 41 మందిని సభ్యులుగా ఎంపిక చేశారు. ఇందులో ఒకే కులానికి చెందిన టీడీపీ కార్యకర్తలతో పాటు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులూ ఉన్నారు. ఇటీవల చెరువులో రెండు వర్గాలకు చెందిన సభ్యులు చెరువులో చేప పిల్లలను వదిలారు. ప్రస్తుతం చేపలు పట్టడానికి అనువుగా ఉండడంతో రెండు రోజుల క్రితం పూజలు నిర్వహించి చేపల వేటను ప్రారంభించారు. ఆ సమయంలో కొందరు టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఇది కాస్త వివాదానికి దారితీయడంతో మత్స్యకార సహకార సంఘం అధికారులు, పోలీసులు రంగ ప్రవేశం చేశారు. హైడ్రామాకు తెరతీసి చేపలను టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు మాత్రమే పడతారని నిర్ణయించారు. అప్పటి నుంచి తమ కళ్ల ముందే చేపలన్నింటినీ టీడీపీ సభ్యులు పట్టుకుని వెళుతుంటే మిగిలిన మత్స్యకార కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. దీనిపై బాధితులు కలెక్టర్‌కు, సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేయడానికి వెళితే.. అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి వెనుదిరిగారు. గతంలోనూ అధికారులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను ఇబ్బంది పెట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ - ఒకరి మృతి

సోమందేపల్లి: మద్యం మత్తులో చోటు చేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లిలోని సాయినగర్‌కు చెందిన ఎరికల నారాయణప్ప (35), మారెప్ప బంధువులు. మంగళవారం నారాయణప్ప ఇంటి వద్ద ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో మారెప్ప చెయ్యి చేసుకోవడంతో నారాయణప్ప అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా, ఘర్షణలో గాయపడిన మారెప్పను స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీ - వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న చాకిల నారాయణప్ప(65) మృతి చెందాడు. లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన నారాయణప్ప మంగళవారం ఉదయం సోమందేపల్లి మండలం కొలింపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన తుంగోడు క్రాస్ వద్దకు చేరుకోగానే కదిరి వైపు వేగంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి గొంతు కోసిన జనసేన కార్యకర్త



గాయపడిన నితీష్

సోమందేపల్లి: గంజాయి మత్తులో జనసేన పార్టీ కార్యకర్త రెచ్చిపోయాడు. కత్తితో ఓ యువకుడి గొంతు కోశాడు. సోమవారం రాత్రి సోమందేపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రి గ్రామంలో డ్రామా జరుగుతుండగా నితీష్ అనే యువకుడు అక్కడకు చేరుకున్నాడు. ఆ సమయంలో నితీష్‌తో అక్కడే ఉన్న ఈదుళబలాపురానికి చెందిన జనసేన కార్యకర్త విక్రాంత్ అకారణంగా గొడవకు దిగాడు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న విక్రాంత్ తన వద్ద ఉన్న కత్తితో నితీష్ గొంతు కోసి, వీపుపై కత్తితో పొడిచాడు. అడ్డుకోబోయిన మరో యువకుడి చేతి వేళ్లను కోశాడు. క్షతగాత్రులను స్థానికులు హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలోని గడ్డం వీధిలో మంగళవారం సాయంత్రం మూడేళ్ల వయసున్న బాలుడు పోతప్పపై నాలుగు వీధికుక్కలు దాడిచేశాయి. తన ఇంటి సమీపంలో బాలుడు ఆడుకుంటూ ఈ ఘటన చోటు చేసుకుంది. బాలుడు తలతో పాటు కడుపు, వీపు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. బాలుడి అరుపులు విన్న తల్లిదండ్రులు సుంకన్న, సుజాత, కాలనీ వాసులు వెంటనే అక్కడకు చేరుకుని కుక్కలను అదిలించారు. తీవ్రంగా గాయపడిన పోతప్పను తొలుత స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం గుంతకల్లుకు, అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

వీఆర్‌ఏ హత్య కేసులో తమ్ముడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం: లేపాక్షి పంచాయతీ పరిధిలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న రామాంజినప్ప(42) హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను హిందూపురం రూరల్ సీఐ కె.జనార్దన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర మంగళవారం వారు వెల్లడించారు. ఆదివారం రాత్రి తన సోదరుడు అశ్వత్థప్పతో గొడవ జరిగిన సమయంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి ఆయన కిందపడి మృతి చెందాడు. మృతుని భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం కల్లూరు క్రాస్ వద్ద తచ్చాడుతున్న అశ్వత్థప్పను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో గత నెల 30న అన్న రామాంజినప్ప తలపై బండరాయితో మోదీ, ఆపై మిద్దెపై నుంచి కిందికి తోసి హతమార్చినట్లు నిందితుడు అంగీకరించడంతో కేసు నమోదుచేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నమ్మించి... హతమార్చి

- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- 4 నెలల తర్వాత నిందితుడి అరెస్ట్

మడకశిర: ఒంటరి మహిళను నమ్మించి తన శారీరక అవసరాలు తీర్చుకున్న అనంతరం హతమార్చి నగలు, నగదు అపహరించుకెళ్లిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మడకశిర పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని వెల్లడించారు. మడకశిర మండలం ఉగ్రేపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో 15 రోజుల క్రితం ఓ అస్థిపంజరాన్ని స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని, అప్పటి మడకశిర అప్‌గ్రేడ్ పీఎస్ ఇన్‌చార్జ్ సీఐ రాజ్‌కుమార్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. అస్థిపంజరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అస్థిపంజరం ఓ మహిళదిగా నిర్ధారణ కావడంతో పోలీసుల విచారణ వేగవంతమైంది. ఈ క్రమంలో మడకశిర మండలం కదిరేపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో మంగళవారం కదిరేపల్లిలోని ఆయన ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆ సమయంలో పోలీసులను గమనించి నరసింహమూర్తి పారిపోతుండగా ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్, ఏఎస్ఐ ముత్యాలప్ప, పీసీలు అన్వేష్, రమణ, నవీన్ వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో విస్తు పోయే నిజాలను వెల్లడించాడు.

పథకం ప్రకారమే ఉమాదేవి హత్య

ఒంటరి మహిళలతో పరిచయం పెంచుకుని వారిని శారీరక అవసరాలకు వాడుకున్న అనంతరం హతమార్చి, మృతదేహంపై ఉన్న నగలు అపహరించుకెళ్లడం నరసింహమూర్తి వృత్తిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో పావగడ తాలూకా అరసికెర గ్రామానికి చెందిన ఉమాదేవి (27) పరిచయమైంది. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న ఆమెను నమ్మించి, మాయమాటలతో 2024, నవంబర్ 16న మడకశిరకు రప్పించుకున్నాడు. అనంతరం తన ద్విచక్రవాహనంపై ఉగ్రేపల్లి సమీపంలోని అటవీ ప్రాంతానికి పిలుచుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో పలుమార్లు ఆమెను శారీరకంగా కలిశాడు. అనంతరం ఉమాదేవి నిద్రిస్తుండగా తాడు తీసుకుని ఆమె మెడకు బిగించి హతమార్చి, శరీరంపై ఉన్న బంగారు నగ తీసుకుని మృతదేహానిన అక్కడికి సమీపంలోని వంకలో పాతి పెట్టి ఉడాయించాడు. కాజేసిన నగను మడకశిరలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.లక్షకు పైగా రుణం తీసుకుని జల్సా చేశాడు. నేరాన్ని అంగీకరించడంతో నరసింహమూర్తిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కనుల పండువగా 'లంకా దహనం'



ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా సాగుతున్న ఉగాది ఉత్సవాలు మంగళవారం నాటి లంకాదహనం కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. దాదాపు రెండు గంటల పాటు సాగిన లంకాదహనం వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి ఆలయం నుంచి అనుబంధ దేవాలయమైన కాశీవిశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఆలయం ఈఓ కె.వాణి, సిబ్బంది ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వరుడికి పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప క్రాకర్స్ సౌజన్యంతో సమకూర్చిన టపాసులతో దాదాపు రెండు గంటలపాటు లంకా దహనం వేడుకగా సాగింది.



లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు